# వర్గ పోరాటాలను తీవ్రంచేయటమే మనముందున్న ఏకైక పరిష్కార మార్గం

**ఐదు** రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు ఇటీవలే ముగిశాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్‌లలో బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వాలు గద్దెదిగిపోయాయి. తెలంగాణా, మణిపూర్ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల ఆధ్వర్యంలో ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్‌పార్టీ మూడు రాష్ట్రాల్లో అధికారం కైవసం చేసుకోగా, తెలంగాణా రాష్ట్రంలో పేలవ ప్రదర్శనకే పరిమితమైంది.

కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ పాలన ప్రారంభమైన నాలుగున్నర ఏళ్ళ తర్వాత ఈ ఎన్నికలు జరిగాయి. పెద్దనోట్ల రద్దు, దాని వెన్నంటే అమలుచేసిన జిఎస్‌టిలు–భారతదేశంలో తయారీ రంగానికి, ఉపాధికల్పనకు వెన్నెముకగానున్న రైతాంగ ఆర్థికాన్ని, తయారీ విభాగాన్ని ప్రత్యేకించి చిన్నతరహా పరిశ్రమలను ఘోరంగా దెబ్బతీసింది. తత్ఫలితంగా వ్యవసాయ సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చింది. ఆర్థికవ్యవస్థ ఉద్యోగావకాశాలను సృష్టించలేకపోతోంది. ఇదంతా నరేంద్రమోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాదుల ఆదేశాలను అమలుచేయటాన్ని కొనసాగిస్తున్న ఫలితమే.

ఈ ప్రజావ్యతిరేక విధానాలనుండి ప్రజల దృష్టి మళ్ళించటానికి, 'గోరక్షణ' 'లవ్ జీహాద్' వంటి వానితో దేశంలో బిజెపి మత విద్వేషాలను రెచ్చగొట్టి, అల్పసంఖ్యాక మతస్థులపై క్రూరమైన దాడులు చేస్తోంది. హిందూమతాన్ని పరిరక్షించే పేరిట ఈ నాలుగున్నర సం॥ల బిజెపి పాలనాకాలంలో వందకు పైగా ఈ తరహా హత్యలు, సామూహికదాడులు చోటుచేసుకున్నాయి. ఈ విధానాలపట్ల వ్యతిరేకతలను అణచివేసేందుకు బిజెపి పాలకులు ఫాశిస్టు తరహా ప్రచారాన్ని, పద్ధతులను అమలుచేస్తున్నారు.

నాలుగు సం॥ల పైగా గడిచిన ఈ కాలంలో, బిజెపి ప్రభుత్వం వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం వంటి వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న ఒక్కగానొక్క సమస్యను పరిష్కరించే ప్రయత్నం కూడా చేయకపోగా, ఈ సమస్యలను మరింత తీవ్రంచేసే విధానాలనే అనుసరిస్తూవస్తోంది. ప్రజలు అసంతృప్తి, ఆగ్రహంతో రగలిపోతున్నారు. తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ భారీ సంఖ్యలో రైతాంగం, కార్మికులు కదలి నిరసన ప్రదర్శనలలో పాల్గొనటంలో ఇది వ్యక్తమౌతోంది. ఈ నేపథ్యంలో, 2019లో పార్లమెంట్‌కు జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు భూమికగా 5 రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు ముందు కొచ్చాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌పార్టీ, బిజెపి పాలనలో జరిగిన అవినీతి, వ్యవసాయ సంక్షోభాలను తన ఎన్నికల ప్రచారంలో ప్రధాన అస్త్రాలుగా చేసుకుంది. బిజెపి అమలుచేస్తున్న విధానాలు తాను అమలు చేసిన విధానాల కొనసాగింపేననే అంశం తెలిసివుండి కూడా కాంగ్రెస్‌పార్టీ నిస్సిగ్గుగా బిజెపిని వేలెత్తిచూపుతోంది. దీనికి ఓ స్పష్టమైన ఉదాహరణ జిఎస్టీ.

గత ఎన్నికలలో అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు రైతాంగ రుణాల రద్దును ప్రకటించాయి. ఈసారి కూడా దాదాపు పాలకపార్టీలన్నీ రైతాంగ రుణాల రద్దును, కనీసమద్దతు ధర కొంతవరకు పెంపును వాగ్దానం చేశాయి. అంటే పాలకవర్గ పార్టీలు వ్యవసాయ సంక్షోభ పరిష్కారం చేయబూనుకున్నారని కాదు. రైతాంగాన్ని భూముల నుండి గెంటివేసి, ఆ భూములను కార్పొరేటు వ్యవసాయానికి కట్టబెట్టటమే వారి విధానాలన్నింటి లక్ష్యం. అదే సమయంలో తాము ప్రవచించే అభివృద్ధి పంథాగా పేర్కొనే దానిని రైతాంగం చేత నమ్మింపచేయటానికే ఈ భారీ పథకాలను పేర్కొంటారు.

5 రాష్ట్రాల శాసన సభల ఎన్నికల అనంతరం, రానున్న లోక్‌సభ ఎన్నికల సన్నాహాలలో భాగంగా, పాలకవర్గ పార్టీలన్నీ ఇదే తీరులో వ్యవహరిస్తున్నాయి. తాను కేంద్రంలో అధికారం చేపడితే, దేశంలోని రైతులందరికీ రుణమాఫీ అమలుచేస్తామని కాంగ్రెస్‌పార్టీ వాగ్దానం చేస్తోంది. రైతులకు పెట్టుబడి సహాయంక్రింద, తెలంగాణా ప్రభుత్వం అమలుచేస్తున్న తరహాలో బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే రైతులకు ప్రతి ఏటా నగదురూపంలో కొంత పెట్టుబడి వ్యయం సమకూరుస్తామని చెప్తోంది. దానిని ఈ సంవత్సరం నుండే అమలుచేస్తామంటూ, 2019–20 'ఓట్ ఆన్ ఎకౌంట్' బడ్జెట్‌లో నిధులు కేటాయించింది.

ఆర్థికంగా వెనుకబడిన విభాగాలకు విద్యా, ఉద్యోగాలలో 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రమంత్రిమండలి ఆమోదం తెల్పింది. మూడురోజుల కాలవ్యవధిలో లోక్‌సభ, రాజ్యసభల ఆమోదం పొంది, రాష్ట్రపతి ఆమోదముద్రతో చట్టంగా అది గెజిట్‌లో ప్రకటించబడింది. సంఘటితరంగంలో, ప్రభుత్వరంగాలలో ఉద్యోగావకాశాలు నానాటికీ కనుమరుగవుతూవుంటే, దేశంలోని దాదాపు 60శాతం జనాభా పరిధిలోని ఆర్థికంగా బలహీన విభాగాలకు, రాజ్యాంగ సవరణద్వారా ప్రతిపాదిత రిజర్వేషన్ల ప్రకటన కేవలం ఉద్యోగార్థులైన విద్యార్థి, యువతలో భ్రమలు కల్పించటంతోపాటు, కుల ప్రాతిపదికపై వారిని మరింతగా ఒకచోటుకి సమీకరించటానికి మాత్రమేననేది స్పష్టం.

రానున్న లోక్‌సభ ఎన్నికలలో ఏ పాలకపార్టీ లేదా ఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ, వ్యవసాయ సంక్షోభానికి, నిరుద్యోగానికి గల మూలకారణాల పరిష్కారం జోలికి వెళ్ళబోవు.అయితే జబ్బుకు కారణమైన మౌలికమైన అంశాల జోలికి వెళ్ళకుండానే, రోగ లక్షణాలను ఉపశమింపజేసే ప్రయత్నాలు చేస్తారు.

కాంగ్రెస్‌పార్టీ, మరికొన్ని పాలకపార్టీలు, వామపక్షపార్టీలు బిజెపి పాలనను మతతత్వ ఫాశిజమ్‌గా అభివర్ణిస్తూ ప్రగతిశీలశక్తులను తమవైపు సమీకరించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. మతవిద్వేషాలు ఏవిధంగా ప్రేరేపించబడతాయనే చర్చను కాంగ్రెస్‌పార్టీ, తన

వర్గస్వభావ రీత్యానే నిరాకరిస్తోంది. అలాగే సామ్రాజ్యవాద, బడాపెట్టుబడిదారీవర్గ ప్రయోజనాలకు సేవచేస్తూ, ప్రజా ఉద్యమాలను క్రూర నిర్బంధం ప్రయోగించి అణచివేసిన చరిత్రే కాంగ్రెస్‌పార్టీది. హిందూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ప్రతీ దేవాలయాన్నీ సందర్శించు కుంటున్నాడు. బిజెపి పాలనలోని అవినీతిని పెడబొబ్బలు పెడుతూ ఖండిస్తోన్న కాంగ్రెస్‌పార్టీ, తన పాలనలో అదే అవినీతికి పట్టం కట్టింది.

పాలకవర్గ పార్టీలేవీ లౌకిక, ప్రజాస్వామిక పార్టీలు కావు. సామ్రాజ్యవాదులకు, బడా పెట్టుబడిదారులకు, బడాభూస్వాములకు సేవచేయటంలో, వారి ప్రయోజనాలను కాపాడటంలో ఆ పార్టీల నడుమ ఇసుమంతైనా బేధాభిప్రాయాలు లేవు. అలాగే ప్రతి సందర్భాన్నీ వినియోగించుకొని ప్రజలను కుల, మత, ప్రాంతీయ ప్రాతిపదికలపై విభజించి, ప్రక్కకుమళ్ళించటంలో, ప్రజల ప్రజాస్వామిక హక్కులను ఘోరంగా అణచివేయటంలో ఆ పార్టీలన్నీ ఒకే తీరుగా వ్యవహరిస్తాయి. బిజెపి ఈ విధానాలను నగ్నంగా అమలుచేస్తుండగా, కాంగ్రెస్ ఈ విధానాలను కుటిలంగా అమలు చేస్తుంది. పాలకవర్గ ప్రతినిధులలో ఏ విభాగం అధికారంలో కొనసాగుతూవున్నా, గత ఏడు దశాబ్దాలకాలంగా దేశంలో ఫాశిస్టుతరహా పాలనే కొనసాగుతూ వుంది.

ప్రజాగ్రహంనుండి తమను తాము మినహాయించుకుంటూ పాలకవర్గాలలో ఒక భాగం సాగించుకునే ప్రచారానికి, ఆ నినాదాలకు కొన్ని విప్లవ కమ్యూనిస్టు సంస్థలు కూడా లోబడటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇది కేవలం పాలకవర్గాలలోని ఒక విభాగాన్ని అధికారంనుండి తొలగించి మరో విభాగాన్ని ప్రతిష్టించటానికి మాత్రమే తోడ్పడుతుంది. విభజించే, ప్రక్కదోవ పట్టించే పాలకవర్గాల విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఇదేమీ తోడ్పడదు. అలాగే మతతత్వం, ప్రజలపై క్రూరనిర్బంధ విధానాలు, ప్రజల ప్రజాస్వామిక హక్కుల అణచివేతవంటి విధానాలపై పోరాడేందుకు కూడా ఏమాత్రం తోడ్పడదు.

మతతత్వాన్ని వివిధ రూపాల్లో–నగ్నంగానూ, కుటిలపూరితంగానూ రెచ్చగొట్టే పాలకవర్గ పార్టీల విధానాలను వెల్లడిచేయటం ప్రజాస్వామిక, దేశభక్తియుత, విప్లవశక్తుల, సంస్థల కర్తవ్యంగా వుంది. వీరంతా, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడటమంటే అన్యాయానికి అసమానతకు వ్యతిరేకంగా పోరాడటమని, మత, లింగ, ప్రాంత, కుల విచక్షణ లేకుండా ప్రజలందరి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకోసం పోరాడటమని గుర్తించాలి. ఈవిధమైన పోరాటం సాగించటానికి ప్రజలు తమ తమ వర్గ సంఘాలలో సంఘటితం కావాలి. వర్గపోరాటం మాత్రమే ప్రజల చైతన్యస్థాయిని పెంపొందించి, అది మాత్రమే మతతత్వ విభజన రాజకీయాలకు వారు లోనుకాకుండా నిలప గలుగుతుంది. నిరాకరించవీలులేని విధంగా చరిత్ర ఈ అంశాన్ని ఎన్నోమార్లు నిరూపించింది.

ooooo